సాక్షి
నిర్మల్

గురువారం : 15 : మే : 2025



దసలి పట్టుతో వస్త్రం

దసలి పట్టుకాయ దిగుబడిలో మొదటి స్థానంలో ఉన్న చెన్నూర్ పట్టుపరిశ్రమ మరో అడుగు ముందుకేసింది. పట్టు దారం, వస్త్రోత్పత్తికి కూడా సన్నద్ధమవుతోంది. 8లో▸



ఎర్త్ రాడ్లతో ముప్పు 9లో▸

విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్త్ కోసం ఏర్పాటు చేసిన ఇనుపరాడ్లు ప్రమాదకరంగా మారాయి. గమనించకుంటే పశువులతోపాటు మనుషులూ బలవుతున్నారు.

గరిష్టం/కనిష్టం
36.0 /27.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

హెలిప్యాడ్ పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

భైంసాటౌన్: పట్టణంలోని పార్డి(బీ) బైపాస్‌రోడ్ లో గల హెలిప్యాడ్ స్థలాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల బుధవారం పరిశీలించారు. కుంటాలలో భూభారతి పైలెట్ ప్రాజెక్ట్ నేపథ్యంలో ఈనెల 16న రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా భైంసాలో హెలీప్యాడ్ స్థలం పరిశీలించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఏఎస్పీ అవినాష్‌కుమార్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈఈ సునీల్ ఉన్నారు.

రేపు కుంటాలకు 'పొంగులేటి'

కుంటాల: భూభారతి కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం కుంటాలకు రానున్నారు. స్థానిక మున్నూరు కాపుసంఘ భవనంలో బుధవారం కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిలతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. వారి వెంట ఏఎస్పీలు రాజేశ్ మీనా, అవినాష్‌కుమార్, భైంసా రూరల్ సీఐ నైలు, ఎస్సై అశోక్ ఉన్నారు.

నిర్భయంగా ఫిర్యాదు చేయాలి



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీజానకీ షర్మిల

భైంసాటౌన్: అర్జీదారులు తమ సమస్యలను నిర్భయంగా తన దృష్టికి తేవాలని ఎస్పీ జీ జానకీషర్మిల పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా భైంసా సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులు పరిష్కరించాలని సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఫోన్‌లో సూచించారు. భరోసా కేంద్రంలో షీ టీం సిబ్బందితో కుటుంబ కలహాల కేసుల్లో ఇరు పార్టీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. భైంసాలో భరోసా కేంద్రం ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ అవినాష్ కుమార్, సీఐలు గోపీనాథ్, నైలు, షీ టీమ్ ఇన్‌చార్జి పెర్సిస్, సిబ్బంది, క్యాంప్ ఇన్‌చార్జి రఘువీర్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నిర్మల్‌చైన్‌గేట్: మైనార్టీ విద్యాసంస్థల్లో ప్రవేశాల ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ చాంబర్‌లో బుధవారం కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 2025–26 విద్యాసంవత్సరానికి గాను మైనార్టీ వసతిగృహాల్లో ఐదో తరగతి, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 6, 7, 8వ తరగతుల్లో పరిమిత సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్



మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

సోన్: మండలంలోని గాంధీనగర్‌లో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 102 బైక్‌లు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకుని ధ్రువపత్రాలు చూపించి తీసుకువెళ్లాలని సూచించారు. వాహనదారులు రోడ్డు నియమాలు పాటించాలని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ బారిన పడవద్దని, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్లకు స్పందించవద్దని, వ్యక్తిగత సమాచారం చెప్పవద్దని సూచించారు. సోన్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సైలు గోపి, సుప్రియ, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ సమావేశం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర ఫంక్షన్‌హాల్‌లో గురువారం నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ఆదివారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశం మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమవుతుందని పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్‌గౌడ్, అవేజ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, లైబ్రరీ చైర్మన్, పార్టీ యువజన, మహిళ, రైతు, విద్యార్థి విభాగం, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓబీసీ అధ్యక్షుడు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, పీసీసీ సభ్యులు, సేవాదళ్ అధ్యక్షులు, పట్టణ, మండలాల అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులున్నారు.

ఫీజుల నియంత్రణపై ఫోకస్

- భారమవుతున్న 'ప్రైవేట్' చదువులు
- రోజురోజుకూ పెరుగుతున్న ఫీజులు
- నియంత్రణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటనపై హర్షం



నిర్మల్‌ఖిల్లా: 'ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాల అభిప్రాయాలు సేకరించాం. త్వరలోనే అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటాం. ఫీజుల నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించింది' ఇవి.. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈనెల 12న 'విద్యా రంగంలో సంస్కరణలు' అంశంపై మంత్రివర్గ సబ్‌కమిటీ, విద్యాశాఖ ఉన్నతాధికారులతో సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో చేసిన వ్యాఖ్యలు. తల్లిదండ్రుల ఆశలను అవకాశంగా మలుచుకున్న ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు వివిధ పేర్లతో బురిడీ కొట్టిస్తున్నాయి. దీంతో అత్యాశకు పోతున్న తల్లిదండ్రులు లక్షలు కుమ్మరిస్తూ భారం భరిస్తున్నారు. టాలెంట్, టెక్నో, ఈ–టెక్నో, డీజీ, ఒలింపియాడ్, మోడల్ స్కూల్, ఐఐటీ, జేఈఈ ఫౌండేషన్ అంటూ తల్లిదండ్రులను ఊహాలోకంలోకి తీసుకెళ్లేందుకు యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై భారం మోపుతున్నారు.

ఏటా పెంచేస్తున్నారు

ప్రైవేట్ పాఠశాలల్లో ఏటా పెరుగుతున్న ఫీజులతో సామాన్యులకు 'బడి' భారమవుతోంది. ప్రైవేట్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతుండగా విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం అమలు చేయాల్సి ఉండగా అధికారుల అలసత్వంతో ఫీజుల పెంపునకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వాల ఉదాసీన వైఖరి కారణంగా ఏటా ప్రైవేట్ పాఠశాలల్లో 10–30 శాతం వరకు ఫీజులు పెంచుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇలా..

ఉమ్మడి ఆదిలాబాద్ 665 గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలున్నట్లు విద్యాశాఖ లెక్కలు చెబుతున్నాయి. నిర్మల్ జిల్లాలో 194, ఆదిలాబాద్‌లో 151, మంచిర్యాలలో 218, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 102 ప్రైవేట్ బడులున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఏటా 1నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థుల సంఖ్య సుమారు 5లక్షల వరకు ఉండగా, ఇందులో ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న వారు 2లక్షలకు పైగా ఉన్నారు. ప్లే, టెక్నో, ఇంటర్నేషనల్, ఈ–టెక్నో, ఒలింపియాడ్ తదితర పేర్లతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎల్‌కేజీ చదువుకే వేలల్లో ఫీజు వసూలు చేస్తున్నాయి. దాదాపు 50 శాతానికంటే ఎక్కువే ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. సర్కారు ఫీజుల నియంత్రణకు పూనుకోగా తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు		
	నిర్మల్: 194	ఆదిలాబాద్: 151
	కు.ఆసిఫాబాద్: 102	మంచిర్యాల: 218

ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తాం

ఇటీవల కేబినెట్ సబ్ కమిటీ ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల్లోని ఫీజుల నియంత్రణపై చర్చ జరిగింది. విద్యాశాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫీజుల నియంత్రణపై కఠినంగా వ్యవహరిస్తాం. రానున్న విద్యాసంవత్సరం నుంచి నిర్ణీత ఫీజుల కన్నా ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం.
– పీ రామారావు, డీఈవో

రూ.లక్షల్లో చెల్లిస్తున్నాం



ఏటా రూ.లక్షా 50 వేలకు పైగా మా పిల్లల ఫీజులు చెల్లిస్తున్న. ఏటేటా ఫీజులు పెంచేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అప్పుడే తల్లిదండ్రులకు భారం తగ్గుతుంది.
– ఆకుల భూమేశ్, ఈద్‌గాం, నిర్మల్

సంపాదనలో సగం చదువులకే..



ప్రైవేట్‌గా ఉపాధి పొందుతూ సంపాదిస్తున్న అరకొర వేతనాల నుంచి 50 శాతానికిపైగా డబ్బు పిల్లల ఫీజుల కోసమే ఖర్చు చేస్తున్నాను. ప్రైవేట్ పాఠశాలల ఫీజులు ఇష్టారీతిన పెంచకుండా ప్రభుత్వం నియంత్రించాలి.
– మార్గం శ్రీనివాస్, నిర్మల్

కఠినంగా వ్యవహరించాలి



ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల నిర్వాహకులు పుస్తకాలు, యూనిఫామ్, అడ్మిషన్ ఫీజుల పేరిట తల్లిదండ్రులపై ఆర్థికభారం మోపుతున్నారు. విద్యను వ్యాపారం చేస్తున్న 'ప్రైవేట్' యాజమాన్యాలపై ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించాలి.
– కైరి శశి, ఏబీవీపీ నేత, నిర్మల్

సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: అటవీ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో సంబంధిత శాఖల అధికారులు సమన్వయం పాటించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. జిల్లాలో ఆర్‌ఎఫ్‌ఆర్ (రైట్‌ఫుల్ ఫారెస్ట్ రూల్స్) అమలుపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మారుమూల అటవీ, గిరిజన ప్రాంతాల్లో రహదారులు, బ్రిడ్జిలు, విద్యుత్ తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు సంబంధిత అధికారులు అటవీశాఖకు సరైన విధంగా ప్రపోజల్స్ సిద్ధం చేసి పంపించాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు చేపట్టాల్సిన ప్రతీ శాఖ తమ ప్రపోజల్స్‌ను అటవీశాఖతో సమన్వయం చేసుకుని ముందుగా ఆమోదం పొందాలని సూచించారు. చేపట్టనున్న అభివద్ధి ప్రాజెక్టులను త్వరగా అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. శాఖల మధ్య సమన్వయంతో అభివద్ధి కార్యక్రమాలు త్వరగా పూర్తిచేయాలని, అటవీశాఖ అవసరమైన మార్గదర్శకాలకు సంబంధిత శాఖలకు త్వరగా పంపించాలని సూచించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ తదితరులున్నారు.

భూసమస్యలు పరిష్కరించాలి

కుంటాల: భూభారతి పథకానికి కుంటాల మండలాన్ని ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం భూభారతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. భూసమస్యల దరఖాస్తులు, ఆన్‌లైన్ ప్రక్రియ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్లు కమల్‌సింగ్, శ్రీకాంత్, ఎజాజ్ అహ్మద్ ఖాన్, ప్రవీణ్‌కుమార్, డీటీ నరేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'భవిత'కు అవరోధం



తానూరులో బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

- గ్రామాల్లో నేటికీ బాల్యవివాహాలు
- 2018 నుంచి ఇప్పటిదాకా జిల్లాలో 102 వివాహాలు నిలిపిన అధికారులు
- తల్లిదండ్రులకు విస్తృత అవగాహన

జిల్లాలో బాల్యవివాహాలు ఇలా..

సంవత్సరం	బాల్యవివాహాలు అడ్డుకున్నవి
2018	10
2019	9
2020	11
2021	20
2022	10
2023	11
2024	20
2025	8



నిర్మల్‌చైన్‌గేట్: అధికారులు బాల్యవివాహాలను అడ్డుకుంటున్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరిస్తున్నారు. ఇటీవల జిల్లాలో 14 ఏళ్ల బాలికకు వివాహం చేస్తున్నారని బాలల పరిరక్షణశాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో బాలల సంక్షేమశాఖ, బాలల పరిరక్షణ అధికారులు, అంగన్‌వాడీ అధికారులు పోలీసులతో కలిసి ఘటనాస్థలికి చేరుకున్నారు. ఇరు కుటుంబాలవారితో మాట్లాడారు. బాల్యవివాహంతో కలిగే అనర్థాలను వివరించారు. వివాహ వయస్సు వచ్చేదాకా వేచి ఉండాలని సూచించారు. లేకపోతే ఇబ్బందులు వస్తాయని జెప్పారు. ఇందుకు ఇరు కుటుంబాలు అంగీకరించాయి. బాలికకు యుక్తవయసు వచ్చాకే పెళ్లి చేస్తామని తెలిపారు. అప్పటివరకు వేచి చూస్తామని అంగీకరిస్తూ ఒప్పంద పత్రాలు కూడా రాసిచ్చారు. ఇక పెళ్లి జరగదని అందరూ భావించగా అదేరోజు గుట్టుచప్పుడు కాకుండా సదరు మైనర్ వివాహ తంతు పూర్తిచేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఐసీడీఎస్ అధికారులు మరోసారి అక్కడికి వెళ్తే పెళ్లి జరగలేదని బుకాయించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది.

అడ్డుకోవడంలో విఫలం

పేదరికం, నిరక్షరాస్యత లాంటి సామాజిక రుగ్మతలతో తల్లిదండ్రులు ఆడపిల్లలను భారంగా భావిస్తున్నారు. త్వరగా వివాహాలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా ప్రజల్లో మార్పు రావడం లేదు. అడపాదడప అధికారులకు అందే సమాచారంతో చిన్నారి పెళ్లి కూతుళ్లకు విముక్తి లభిస్తున్నా బాల్యవివాహాలను పూర్తిస్థాయిలో అడ్డుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు.

గ్రామస్థాయిలో కమిటీలు

జిల్లా ఏర్పడిన తర్వాత ప్రత్యేకంగా మాతాశిశు సంరక్షణ, సఖీ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై బాలల సంరక్షణ అధికారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలను నిరోధించడానికి ప్రభుత్వం పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసింది. కమిటీల్లో సర్పంచ్ చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి, వీఆర్, ప్రభుత్వ ఉపాధ్యాయులు, మహిళా సంఘం సభ్యులు, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలను సభ్యులుగా నియమించింది.

కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలి

బాల్య వివాహాలు చేయడంతో అనర్థాలు జరిగే అవకాశం ఉంటుందని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. బాలికలు రక్తహీనతకు గురికావడం, అనారోగ్యకర శిశువులకు జన్మనివ్వడంలాంటి ఘటనలు జిల్లాలో అనేకం జరుగుతున్నాయి. బాల్య వివాహాలతో ఎదురయ్యే దుష్పరిమాణాల గురించి ఎన్ని అవగాహన సదస్సులు నిర్వహించినా మార్పు అనేది ముందుగా కుటుంబ వ్యవస్థలో రావాల్సిన అవసరం ఉంది. బాలికలను గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించి ఉన్నత విద్యకు ప్రోత్సహించాలి. 18 ఏళ్లు దాటిన తర్వాతే పెళ్లి చేస్తే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాలు కూడా వర్తిస్తాయి. బాలికావిద్యను ప్రోత్సహిస్తే వారే భవిష్యత్‌కు బాటలు వేసుకుంటారు.

సమాచారం అందితేనే..

గ్రామాల్లో బాల్యవివాహం చేస్తున్నట్లు సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తేనే స్పందిస్తున్నారు. డీసీటీయూ, ఐసీడీఎస్, సఖీ సిబ్బందితో పాటు పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, పంచాయతీ సిబ్బంది అక్కడికి వెళ్లి బాల్యవివాహాలను నిలుపుదల చేస్తున్నారు. జిల్లాలో 2018 నుంచి ఇప్పటివరకు 396 గ్రామపంచాయతీల్లో 102 బాల్యవివాహాలను అధికారులు అడ్డుకున్నారు. ఒకవేళ అధికారులకు సమాచారం లేకపోతే బాల్యవివాహం సాఫీగా చేసేస్తున్నారు. బాల్యవివాహాన్ని ప్రోత్సహించే, సహకరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

కేసు నమోదు చేశాం

18 ఏళ్లు నిండని బాలికలకు వివాహం నిశ్చయమైతే బాల్యవివాహ నిరోధక అధికారులు లేదా చిల్డ్రన్స్ హెల్ప్‌లైన్‌కు 1098 నంబర్‌లో సమాచారం ఇవ్వాలి. ఇటీవల తానూరులో 15 ఏళ్ల బాలికకు వివాహం నిశ్చయించిన తల్లిదండ్రులు, వరుడి తల్లిదండ్రులు వివాహానికి సహకరించిన పెద్దమనుషులు, ఫంక్షన్‌హాల్ యజమాని, పంతులుపై బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం కేసు నమోదు చేశాం.
– ఫైజాన్ అహ్మద్, ఇన్‌చార్జి జిల్లా సంక్షేమశాఖ అధికారి

గిరి'జనులకు' రైలు కూత!

- మంచిర్యాల–ఉట్నూరు–ఆదిలాబాద్‌కు ముందడుగు
- నిజామాబాద్–నిర్మల్, పటాన్‌చెరు–ఆదిలాబాద్ దాక
- కొత్త లైన్లకు ఇంజినీరింగ్, ట్రాఫిక్, ఫిజిబిలిటీ సర్వేలకు ప్రతిపాదనలు
- పింక్‌బుక్ 2025–26లో నిధులు అంచనా వేసిన రైల్వే శాఖ
- పట్టాలెక్కితే ఏజెన్సీ ప్రాంత వాసులకు రైలు యోగం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గిరిజన ప్రాంతాల్లో కొత్త రైల్వే లైన్ల ఏర్పాటుకు ముందడుగు పడింది. తొలిసారిగా ఉమ్మడి జిల్లా గిరిజన, అడవుల వెంట రైలు మార్గాల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందుతోంది. ఈ మేరకు 2025–26 ఆర్థిక సంవత్సర రైల్వే బడ్జెట్ కేటాయింపులు తెలిపే కీలక పింక్‌బుక్‌లో వెల్లడించింది. గత ఫిబ్రవరిలోనే బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికీ తాజాగా రైల్వేశాఖ ఈ బుక్‌లో ఉమ్మడి జిల్లాకు పలు కొత్త మార్గాలు, ట్రాఫిక్ సర్వేల కోసం నిధుల ప్రతిపాదనలు ఉన్నాయి. భవిష్యత్‌లో కాజీపేట–బల్లార్షా 234కి.మీ. నాలుగో లైన్ సర్వేకు రూ.4.68కోట్లు, వన్యప్రాణులకు ప్రాణనష్టం జరగకుండా బలార్షా, ఆసిఫాబాద్ రోడ్ వరకు రైల్వే పట్టాల ఫెన్సింగ్‌కు నిధులు ప్రతిపాదించారు.

మంచిర్యాల టు ఆదిలాబాద్ వయా ఉట్నూరు

మంచిర్యాల నుంచి వయా ఉట్నూరు ఆదిలాబాద్ దాక ప్రతిపాదిత కొత్త మార్గం 186కి.మీ నిడివి. ఇందుకు రూ.వంద కోట్లు అంచనా ప్రతిపాదించారు. ఈ లైను ఏర్పాటు కోసం భూమి, ట్రాఫిక్, ఫిజిబిలిటీ సర్వేలకు ఈ నిధులు వెచ్చించనున్నారు. కొత్తగా నిజామాబాద్–నిర్మల్–ఆదిలాబాద్ మధ్య మార్గం 125కి.మీ. కోసం ఇంజినీరింగ్, ట్రాఫిక్ సర్వే కోసం రూ.31లక్షలు, మరో కొత్త మార్గమైన పటాన్‌చెరు (నాగలపల్లి) వయా బోధన్ ఆర్మూర్ మీదుగా ఆదిలాబాద్ వరకు ఫైనల్ లొకేషన్ సర్వే 317కి.మీ కోసం రూ.7.92కోట్లు, ముత్కేడ్–ఆదిలాబాద్–పింపల్‌కుటి 183కి.మీ ఫైనల్ లొకేషన్ సర్వే కోసం రూ.3.66కోట్లు, ఆదిలాబాద్ –గడ్చాందూర్ 70కి.మీ సర్వే కోసం రూ.1.75కోట్లు, యావత్మాల్–ఆదిలాబాద్– వయా గంటిజి, పందర్‌కావందన్, చానఖా వరకు 100కి.మీ సర్వే కోసం రూ.25లక్షలు, సికింద్రాబాద్–ముత్కేడ్– ఆదిలాబాద్ 420కి.మీ ఇంజినీరింగ్, ట్రాఫిక్ ప్రాథమిక డబ్లింగ్ సర్వేకు రూ.1.64కోట్లు ప్రతిపాదించారు.

ఆర్వోబీలు, స్టేషన్ల ఆధునికీకరణ

ఆర్వోబీలు, వంతెనలకు ఆర్‌ఆర్‌ఎస్‌కే (రాష్ట్రీయ రేల్ సంరక్ష కోశ్), ఆర్‌ఎస్ నిధులు(రైల్వే సేఫ్టీ ఫండ్) కేటాయిస్తుంది. ఆదిలాబాద్ యార్డు–రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) లెవల్ క్రాసింగ్‌కు రూ.5.69 కోట్లు, ముత్కేడ్ ఆదిలాబాద్ పింపల్‌కుట్టి 68కి.మీ. రూ.4.71కోట్లు, ముత్కేడ్–ఆదిలాబాద్ 8.16కి.మీ. రూ.1.04కోట్లు, ఆర్‌ఆర్‌ఎస్‌కే రూ.1.93కోట్లు, ఆర్‌ఎస్‌ఎఫ్ రూ.9.73కోట్లు, ముత్కేడ్–ఆదిలాబాద్ ఘాట్ సెక్షన్‌లో ఆర్‌ఆర్‌ఎస్‌కే నుంచి రూ.6.40 కోట్లు, ఆదిలాబాద్ పిట్ లైన్ నిర్మాణం కోసం మూలధన నిధులు రూ.22.28కోట్లు, మంచిర్యాల–పెద్దంపేట మధ్య మూడో లైనుకు 4.37కి.మీ, మంచిర్యాల జిల్లా తాండూరు మండలం రేచ్నీ, రేపల్లెవాడ మధ్య రోడ్ కొత్తగా అండర్ బ్రిడ్జికి రూ.7.64 కోట్లు, ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో భవనాలు, మరుగుదొడ్లు, విస్తరణ అభివృద్ధి కోసం రూ.4.44కోట్లు, 'అమృత్' స్కీం కింద ఆదిలాబాద్ స్టేషన్‌లో ఎఫ్‌వోబీ (ఫుట్ ఓవర్ బ్రిడ్జి) నిర్మాణం, దివ్యాంగుల ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు, ఇతర ఏర్పాట్లకు ఎంపిక చేశారు. స్టేషన్‌లో లెస్ ట్రాక్, క్విక్ వాటరింగ్ కోసం రూ.14.95కోట్లు, ప్లాట్‌ఫాంలపైన కవర్ నిర్మించేందుకు రూ.4.61కోట్లు ప్రతిపాదించారు. మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు అమృత్ స్కీం కింద నిధులు ప్రతిపాదించారు.

కార్యరూపం దాల్చితేనే..

నిధుల ప్రతిపాదనలతో సరిపెట్టకుండా ఆ మేరకు మంజూరు చేసి కార్యరూపం దాల్చితేనే కొత్త మార్గాల్లో రైలు ప్రయాణ యోగం కలుగనుంది. గత కొన్నేళ్లుగా రైల్వేలో ఫైనల్ లొకేషన్ సర్వే జరిగిన పనులు సైతం ఇప్పటికీ పట్టాలెక్కడం లేదు. తాజా ప్రతిపాదిత రైలు మార్గాలు అటవీ, వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాలతోపాటు అనేక గిరిజన ప్రాంతాల నుంచి వెళ్లనుంది. దీంతో భూ సేకరణ, అటవీ అనుమతులు, పరిహారం రూ.వందల కోట్లలోనే ఉండనుంది. ఈ నేపథ్యంలో కేవలం పింక్‌బుక్‌లో కాగితాలపైనే సరిపెడితే మారుమూల ప్రాంతాలకు రైలు కూత అందని ద్రాక్షగానే మారనుంది.

'పనిచేసే వారికే పదవులు'



మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర పరిశీలకుడు చంద్రశేఖర్‌గౌడ్

ఖానాపూర్: పార్టీ కోసం పనిచేసిన వారికే పార్టీ సంస్థాగత, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని టీపీసీసీ ఉమ్మడి జిల్లా పరిశీలకులు చంద్రశేఖర్‌గౌడ్, అవేజ్‌ఖాన్ పేర్కొన్నారు. పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపిన ఘనత కాంగ్రెస్‌దేనని చెప్పారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి మరోసారి సీఎం అయ్యేలా పార్టీ కోసం ప్రభుత్వంలో పని చేస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో పార్టీలో ఎలాంటి అంతర్గత విభేదాలు లేవని స్పష్టం చేశారు. పార్టీ సమావేశానికి గైర్హాజరయిన మండల బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా పరిశీలకులను కోరారు. ఉమ్మడి జిల్లాకు నామినేటెడ్ పదవులు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కొందరు కోవర్టులతో పార్టీ అబాసు పాలవుతోందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు అడ్డి భోజారెడ్డి, తహర్‌బిన్ అహ్మద్, అజ్మీరా శ్యాంనాయక్, భూమన్న, ముకాడే, విశ్వనాథ్, లక్ష్మీనారాయణ, చంద్రయ్య, ఇక్బాల్, మాజిద్, తరి శంకర్, దుర్గా భవాని, చిన్నం సత్యం, ఏ రాజెందర్, పీ సతీశ్‌రెడ్డి, ఇసాక్, దయానంద్, స్వప్నిల్‌రెడ్డి, నిమ్మల రమేశ్, షబ్బీర్‌పాషా, సలీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బంద్ సక్సెస్ చేయాలి



కనకాపూర్‌లో మాట్లాడుతున్న వెంకట్రాములు

లక్ష్మణచాంద: గ్రామీణ బంద్ సక్సెస్ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కనకాపూర్ గ్రామంలో కేఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మే 20న కార్మిక వర్గం నిర్వహిస్తున్న జాతీయ సార్వత్రిక సమ్మెలో ఎస్‌కేయం ప్రజాసంఘాలు పాల్గొంటున్నాయని చెప్పారు. ఉపాధిహామీ పని దినాలను సగానికి తగ్గించిన కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కూలీలు ఐక్యంగా గ్రామీణ సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని తెలిపారు. వీటిలో పార్లమెంట్‌లో చట్టం చేసి వ్యవసాయ కూలీలకు ఉపాధిహామీలో రోజు కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ లంక రాఘవులు, పద్మ, జిల్లా అధ్యక్షుడు ఠాకూర్ తిరుపతి, ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, మంచిర్యాల జిల్లా కార్యదర్శి అశోక్, కామారెడ్డి జిల్లా కార్యదర్శి నరసింహ, నిర్మల్ జిల్లా సహాయ కార్యదర్శి మురళీమోహన్, మంచిర్యాల జిల్లా సీనియర్ నాయకులు బుచ్చయ్య, నిర్మల్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగారాం, జాదవ్ కిషన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు అదుపుతప్పి ఎఫ్ఆర్వోకు గాయాలు

కోటపల్లి: మండలంలోని చెన్నూర్ కోటపల్లి ప్రధాన రహదారిపై కారు అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నీల్వాయి ఫారెస్టు రేంజ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న అప్పలకొండ బుధవారం చెన్నూర్ నుంచి నీల్వాయికి కారులో వెళ్తుండగా పాలవాగు సమీపంలో అదుపుతప్పి అటవీప్రాంతంలోకి దూసుకెళ్లింది. అప్పలకొండకు తల, నుదుటిపై గాయాలుకాగా కారు నుజ్జునుజ్జు అయ్యింది. విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు క్షతగాత్రుడిని ముందుగా చెన్నూర్ ఆస్పత్రికి, మెరుగైన వైద్యంకోసం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. రాత్రి పెట్రోలింగ్ డ్యూటీ చేసి నిద్రలేకపోయే సరికి ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: మహిళపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి నిర్మల్ కోర్టు జడ్జి శ్రీవాణి పదేళ్ల జైలుశిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయల అధికారి డల్లుసింగ్ తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళ ప్లాస్టిక్ వస్తువులు వేరుకుంటూ జీవనం సాగిస్తోంది. 2022 జులై 20న స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద ప్లాస్టిక్ వస్తువులు ఏరుకుంటూ ఉండగా జిల్లా కేంద్రానికి చెందిన సోన్న అడేల్లు ఆమెను చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం జరిపాడు. బాధిత మహిళ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్‌రావు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

పలువురిపై కేసులు నమోదు

ఆదిలాబాద్: వేర్వేరు ఘటనల్లో పలువురిపై బుధవారం కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. ఇంటి వద్ద అక్రమంగా తెల్లకల్లు అమ్ముతున్న ఇందిరానగర్ కాలనీకి చెందిన సతీశ్‌గౌడ్‌పై, బైక్ నంబర్ ప్లేట్ మార్ఫింగ్ చేసి తిరుగుతున్న అబ్దుల్ అజాముల్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వలేదని ఇందిరానగర్ కాలనీకి చెందిన గణేశ్‌పై అదే కాలనీకి చెందిన కృష్ణ, భుజంగ్, పవన్ దాడికి దిగారు. బాధితుని ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

సారంగపూర్: మండలంలోని మలక్‌చించోలి గ్రామానికి చెందిన కుర్మె దేవన్న (50) ఈనెల 7న దుబాయ్‌లో గుండెపోటుతో మృతి చెందగా బుధవారం మృతదేహం స్వగ్రామం చేరుకుంది. దుబా య్‌లోని అల్ హుబేదా అనే కంపెనీలో మూడు దశాబ్దాలుగా కార్మికుడిగా పనిచేసి అక్కడే మృతి చెందడంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వ దేశానికి తెప్పించాలని ఎన్ఆర్ఐ అడ్వయిజరీ కమి టీ సభ్యుడు స్వదేశ్ పరికిపండ్లకు విజ్ఞప్తి చేశారు. ఆ యన అక్కడి ఎంబసీ అధికారులతో మాట్లాడి మృతదేహాన్ని హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యే క అంబులెన్స్‌లో మలక్‌చించోలికి పంపించగా కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు.

దసలి పట్టుతో వస్త్రం

- దారం, వస్త్ర తయారీలో శిక్షణకు 30మంది రైతుల ఎంపిక
- కాయ దిగుబడిలో తెలంగాణలో అగ్రస్థానం
- యంత్రాల కోసం రూ.20.54 లక్షలు
- మూడు నెలల్లో తయారీ మరూ..



చెన్నూర్ పట్టు పరిశ్రమ గోదాం వద్ద ఆరబోసిన దసలి పట్టు కాయలు

చెన్నూర్ పట్టు పరిశ్రమ ఆధ్వర్యంలో 2024–25 ప్రగతి

ఉత్పత్తి	లక్ష్యం	సాధన
గుడ్ల ఉత్పత్తి	0	84,605
పెంచిన పట్టుగుడ్ల సంఖ్య	48,200	1,34,765
పండించిన దసలి కాయలు	24,10,000	32,29,301
ఈ ఏడాది రైతుల సంఖ్య	534	567

చెన్నూర్: దసలి పట్టుకాయ దిగుబడిలో మొదటి స్థానాన్ని సొంతం చేసుకుంటున్న మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టు పరిశ్రమ మరో అడుగు ముందుకేసింది. రైతులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పట్టు దారం, వస్త్ర తయారీకి సన్నద్ధం అవుతోంది. వస్త్ర తయారీకి అవసరమైన యంత్రాల కోసం రూ.20.54లక్షలు మంజూరయ్యాయి. దారం, వస్త్రాల తయారీపై శిక్షణకు 30మంది రైతులను ఎంపిక చేశారు. నెల రోజులపాటు నిపుణులతో చెన్నూర్ పట్టు పరిశ్రమలో శిక్షణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో మూడు నెలల్లో చెన్నూర్ కేంద్రంగా పట్టు వస్త్రాల ఉత్పత్తి ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

చెన్నూర్ నంబర్ వన్

మంచిర్యాల జిల్లా చెన్నూర్ దసలి పట్టు సాగు రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. దసలి పట్టు కాయ దిగుబడికి పేరుగాంచింది. ఈ ఏడాది ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి మించి దసలి పట్టు కాయ దిగుబడి వచ్చింది. గతంతో పోలిస్తే ప్రభుత్వం పట్టు పరిశ్రమ అభివృద్ధికి ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ఇప్పటివరకు పట్టు కాయ దిగుబడి మాత్రమే ఉండగా..రానున్న రోజుల్లో రీలింగ్‌తోపాటు వస్త్రోత్పత్తికి అవకాశం ఉంది. ఇప్పటికే రైతులు సాగుతో ఉపాధి పొందుతుండగా.. వస్త్రోత్పత్తి జరిగితే మరింత ఉపాధి లభించే అవకాశం ఉంది.

భూమి లేని గిరిజన రైతులే..

అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవించే గిరిజన, ఎస్సీ, బీసీ నిరుపేద రైతులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం దసలి పట్టు కాయ సాగును ప్రోత్సహిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లో భూమి లేని రైతులను గుర్తించి దసలి కాయ పండించే విధానంపై శిక్షణ ఇచ్చింది. మూడు దశాబ్దాలుగా జిల్లాలో సుమారు వెయ్యి మంది రైతులు 7,500 ఎకరాల్లో దసలి పట్టు కాయలు పండిస్తున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా గొల్లతరివి డి, కౌటాల, బెజ్జూర్, మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం మన్నెగూడెం, కోటపల్లి మండలం కొత్తపల్లి, రాజారాం, లింగన్నపేట, నాగంపేట, ఎదుల్ల బంధం, వేమనపల్లి మండలం ముల్కల్లపేట, చెన్నూర్ మండలం కిష్టంపేట, లింగంపల్లి గ్రామాల్లో దసలికాయను పండిస్తూ ఉపాధి పొందుతున్నారు. గత ఏడేళ్లుగా కుమురంభీం జిల్లాలో దసలి పట్టు సాగుకు అటవీ అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో అక్కడ సాగు లేదు. ప్రస్తుతం మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లోనే దసలి పట్టు కాయ సాగు చేస్తున్నారు.

రైతుల శ్రమే పెట్టుబడి..

దసలి పట్టు కాయ పంట సాగుకు పెద్దగా పెట్టుబడి అవసరం లేదు. రైతుల శ్రమనే పెట్టుబడి. ఒక్కో రైతు రూ.2వేల నుంచిరూ.3వేలతో దసలి గుడ్లు కొనుగోలు చేస్తే సరిపోతుంది. గుడ్లు పిల్లలు అయ్యే వరకు జాగ్రత్తగా కాపాడుకోవాలి. పిల్లలు బయటకు వచ్చిన తర్వాత వాటిని చెట్లపై వేస్తారు. పట్టు పురుగులు ఆకులను తింటూ 20రోజులకు దసలి పట్టు కాయగా మారుతాయి. 40 నుంచి 55 రోజుల్లో కాయ చేతికి వస్తుంది. పట్టు పురుగులను పక్షులు తినకుండా కాయ దశకు వచ్చే వరకు జాగ్రత్తలు పాటిస్తే ఆశించిన లాభాలు వస్తాయి. రెండు నెలలు కష్టపడితే ఒక్కో రైతుకు 20వేల నుంచి 40వేల వరకు కాయ చేతికి వస్తుంది. ఒక్కొక్కరూ రూ.80వేల నుంచి రూ.1.50లక్షల వరకు సంపాదిస్తారు.

ఏడాదికి మూడు పంటలు

దసలి పట్టు కాయ పంట 45రోజుల్లో చేతికొస్తుంది. వానాకాలం మూడు నెలలు వదిలితే ఏడాదికి మూడు పంటలు పండిస్తారు. కాయలో బైవొల్టిన్, ట్రైవొల్టిన్ అనే రెండు రకాలు ఉన్నాయి. మొదటి రకం వెయ్యి కాయకు రూ.4వేల నుంచి రూ.4,350 వరకు, రెండో రకం రూ.2వేల నుంచి రూ.3వేల వరకు పలుకుతుంది. దసలి గుడ్లపై 50శాతం రాయితీ ఉండడంతో బైవొల్టిన్ దసలి కాయలనే ఎక్కువగా పండిస్తున్నారు.

మూడు నెలల్లో..



గత ఏడాది దసలి పట్టు రైతుల కిసాన్ మేళాలో నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసింది. భవన నిర్మాణం పూర్తి కావడంతో ఇటీవల మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రారంభించారు. భవనంలో దారం తీసే యంత్రాలను అమర్చి రీలింగ్ చేసి వస్త్రం ఉత్పత్తి చేస్తాం. త్వరలో రైతులకు శిక్షణ తరగతులు ప్రారంభించి మూడు నెలల్లో వస్త్రం తయారీ చేస్తాం.

– పార్వతీ రాథోడ్, ఏడీ, సెరికల్చర్

మొదటి స్థానంలో మంచిర్యాల జిల్లా..

దసలి పట్టు కాయ దిగుబడిలో రాష్ట్రంలోనే మంచిర్యాల జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. రాష్ట్రంలోని భద్రాచలం, భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాలో దసలి పట్టు కాయ సాగు చేస్తుండగా.. మంచిర్యాల జిల్లాలోనే అత్యధికంగా రైతులు పండిస్తున్నారు. ఇక్కడి పట్టు కాయకు తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ డిమాండ్ పలుకుతుంది. చెన్నూర్ పట్టు పరిశ్రమ ఆవరణలో దసలి పట్టు కాయ వేలంపాటల్లో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు పాల్గొనడం గమనార్హం.

సింగరేణి హైస్కూల్ లోగో ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న సీఎండీ బలరాం నాయక్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో సింగరేణి కాలరీస్ హైస్కూల్ (ఎయిడెడ్)ను ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సంస్థ సీఎండీ బలరాం నాయక్ బుధవారం హైదరాబాద్‌లోని తన చాంబర్‌లో డైరెక్టర్ (ఆపరేషన్) సూర్యనారాయణతో కలిసి లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదెకరాల సువిశాల స్థలంలో ఏర్పాటు చేసిన హైస్కూల్‌లో ఇప్పటి వరకు సుమారు 40 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత పదవుల్లో రాణిస్తున్నారన్నారు. హైస్కూల్ స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



వాణి (ఫైల్)

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన బర్కుంట వాణి (33) అదృశ్యమైనట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. ఏప్రిల్ 23న ఇంటినుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి రాలేదు. ఇంతకాలం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి బర్కుంట పెద్ద ముత్యం బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సబ్‌స్టేషన్‌లోకి చొరబడిన ఎలుగుబంటి



రోడ్డుపై పరుగులు తీస్తున్న ఎలుగుబంటి

జన్నారం: మండలంలోని కవ్వాల్ పులుల అభయారణ్యంలోని ఎలుగుబంట్లు జనావాసాల్లో సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బుధవారం తెల్లవారుజామున జన్నారం జింకల పార్కుకు సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి ఎలుగుబంటి చొరబడటంతో సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. కొద్దిసేపటి తర్వాత అది బయటికి వెళ్లిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. వారం రోజులుగా మండలంలోని జువ్విగూడ, పైడిపెల్లి, జింకలపార్కు సమీపంలో ఎలుగుబంట్లు రోడ్లవెంట కనిపిస్తున్నాయని పలువురు పేర్కొన్నారు. ఈ ప్రాంతాల గుండా రాత్రి వేళ ప్రయాణం చేసేవారు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు.

పాస్‌పోర్టు లేక..ఇంటికి తిరిగి రాలేక

- ఎడారి దేశంలో గల్ఫ్ కార్మికుడి కష్టాలు
- స్వగ్రామానికి రప్పించాలంటూ కుటుంబ సభ్యుల వేడుకోలు



స్వదేశ్‌కు విన్నవిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: ఉపాధి కోసం పొట్టచేత పట్టుకుని ఎడారి దేశం పయనమైన నిర్మల్ జిల్లా వాసి అక్కడి కంపెనీ యాజమాన్యం వీసా పునరుద్ధరించకపోవడంతో అక్కడ పనిచేయలేక, తిరిగి ఇండియా రాలేక కష్టాలు అనుభవిస్తున్న ఉదంతమిది. నిర్మల్ పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన అంకం సుధీర్ కుమార్ 2023లో సౌదీ అరేబియాకు వెళ్లి ఆరంకో కంపెనీలో ఫోర్‌మెన్‌గా విధుల్లో చేరాడు. 15 నెలల తర్వాత వీసా గడువు ముగిసింది. సదరు కంపెనీ యాజమాన్యం గడువును పునరుద్ధరించలేకపోవడంతో విధులకు వెళ్లలేక, ఇంటికి తిరిగి రాలేక తాను ఉంటున్న గదిలోనే సతమతమవుతున్నాడు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఇండియాకు రప్పించేలా కృషి చేయాలని బాధితుని భార్య అంకం వాణి, తల్లి సుజాత బుధవారం కలెక్టరేట్‌లోని గల్ఫ్ ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. గల్ఫ్ ఎన్నారై రాష్ట్ర అడ్వైజరీ కమిటీ సభ్యులు స్వదేశ్ పరికిపండ్లను కూడా కలిసి సుధీర్ కుమార్ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సమస్యను రాష్ట్ర కమిటీ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సుధీర్‌ను ఇండియాకు రప్పించేలా కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య



ఆకాశ్(ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): తెల్లవారితే డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు హాజరు కావాల్సిన ఆ విద్యార్థి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎస్.మధుకర్ తెలిపిన వివరాల మేరకు హన్మాన్‌వాడకు చెందిన సెండే సోమయ్య, శాంతాబాయి దంపతుల కుమారుడు సెండే ఆకాశ్ (21) ఆసిఫాబాద్‌లోని డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సదరు విద్యార్థి మూడు నెలలుగా కడుపులో నొప్పితో బాధపడుతున్నాడు. మంగళవారం సాయంత్రం ఇంటినుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లిచూడగా పురుగుల మందుతాగి విగత జీవిగా పడిఉన్నాడు. వెంటనే ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా ఆకాశ్ స్వయంగా 'కిట్టుబోల్తె' అనే యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేశాడు. రీల్స్ చేసేవాడు. కొద్దిరోజుల క్రితం యూట్యూబ్ చానల్‌ను హ్యాక్ చేసినట్లు తెలిసింది. మృతుని తండ్రి సోమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో దూకి మహిళ..

బెల్లంపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని బెల్లంపల్లి బస్తీలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎస్.దేవయ్య తెలిపిన వివరాల మేరకు బస్తీలో నివాసం ఉంటున్న ఆయిళ్ల పోశు (60)మూడు నెలల క్రితం పక్షవాతానికి గురైంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. బుధవారం బస్తీ శివారులో ఉన్న పోశమ్మ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త అయిళ్ల పోశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.


సెలంగై నాథంలో ఆదిలాబాద్ కళాకారులు



ప్రశంస పత్రం అందుకుంటున్న శ్రీధర్

ఇచ్చోడ: తమిళనాడు రాష్ట్రంలోని తంజావూర్‌లో నిర్వహించిన సెలంగై నాథంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కళాకారులు గుస్సాడీ నృత్య ప్రదర్శన చేసి పలువురిని అలరించారు. ఆదివాసీ సకల కళా సంక్షేమ డైరెక్టర్ కాత్లె శ్రీధర్ ఆధ్వర్యంలో కళాకారులు ఆనంద్, రాము, చిట్టిబాబు, సమ్మక్క, రాజేంద్రప్రసాద్, జలంధర్, దేవురావు, పవన్, సందీప్, లక్ష్మణ్, చరణ్, ఉదయ్ గుస్సాడీ, కొమ్ము, కోయ నృత్యాలు ప్రదర్శించి ప్రశంసపత్రాలు అందుకున్నారు.

రోడ్డుపైనే లారీలు..



లోకేశ్వరం–నిజామాబాద్ రహదారిపై లారీల క్యూ

లోకేశ్వరం: మండలంలోని నగర్ శివారులో ఉన్న ప్రైవేటు గోదాంలను ప్రభుత్వం లీజుకు తీసుకుంది. కొనుగోలు కేంద్రాల నుంచి లారీల ద్వారా జొన్నలు తీసుకువచ్చి ఇక్కడ నిల్వ చేస్తున్నారు. గోదాంల వద్ద లారీల్లోంచి బస్తాలను అన్‌లోడింగ్ చేసేందుకు సరిపడా కూలీలు లేకపోవడంతో లోకేశ్వరం– నిజామాబాద్ రహదారిపై లారీలు ఇలా రెండు, మూడు రోజులుగా నిలిచి ఉంటున్నాయి.

మామిడి తోటలపై ఎండల ప్రభావం

- రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి
- ఉద్యానవనశాఖ అధికారి కళ్యాణి



కిష్టంపేట సమీపంలోని మామిడిచెట్టు

చెన్నూర్‌రూరల్: వేసవికాలంలో మండుతున్న ఎండల నుంచి పండ్ల తోటలను రక్షించుకోవడంపై రైతులు దృష్టి సారించాలని హెచ్‌వో కళ్యాణి సూచిస్తున్నారు. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడం, గాలిలో తేమశాతం తగ్గుముఖం పట్టడంతో పండ్ల తోటల్లో కాయలపై పొడలు ఏర్పడి పెరుగుదల తగ్గిపోవడమే కాకుండా నాణ్యత కూడా దెబ్బతింటుంది. నాణ్యత లోపించిన కాయలకు మార్కెట్‌లో ధర గిట్టుబాటు కాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. కాబట్టి వేసవిలో పండ్ల తోటలపై కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. మంచిర్యాల జిల్లాలో సుమారు 18 వేల ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేస్తున్నారు. ఇందులో చెన్నూర్ మండలంలోని ఎర్రగుంటపల్లి, కొమ్మెర, ఆస్నాద, బుద్దారం, సంకారం, కన్నెపల్లి, పొక్కూరు, తదితర గ్రామాల్లో ఎక్కువ మొత్తంలో సాగవుతున్నాయి.

మామిడి తోటల రక్షణ

వేసవిలో ఎండలు పెరిగే కొద్ది కాయలపై ప్రభావం ఎక్కువగా పడుతుంది. ఎండ వేడిమికి కాయలు దెబ్బతిని పెరుగుదల, నాణ్యత తగ్గిపోతుంది. ఎండ సోకిన ప్రాంతంలో కాయకు గుంత పడుతుంది. చాలా సందర్భాల్లో 20 నుంచి 30 శాతం వరకు కాయలు ఎండ తీవ్రతతో దెబ్బతింటాయి. ఇందులో బంగినపల్లి, నీలం, తోతాపరి, పలు రకాల కాయలకు ఎండ బెడద ఎక్కువగా ఉంటుంది. దీంతో కోతకు ముందే కాయ లోపలి భాగంలో మచ్చలు ఏర్పడి కణజాలం కుళ్లుతుంది. దీంతో చాలా వరకు కాయలు రాలిపోతాయి. 20 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న తోటల్లో ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

నివారణ

పిందెలు గోలి సైజులో ఉన్నప్పుడు ఒకసారి, నిమ్మ కాయ సైజులో ఉన్నప్పుడు మరోసారి లీటరు నీటికి 20 గ్రాముల సున్నం, అర మిల్లీ లీటరు జిగురు కలిపిన ద్రావణాన్ని పిందెలు, కాయలపై సన్నటి పొర ఏర్పడేలా పిచికారీ చేయాలి.

ఎండల నుంచి కాయలకు రక్షణ

వేసవిలో ఎండలకు కాయలు కమిలి నాణ్యత బాగా దెబ్బ తినడం వలన ధర తక్కువగా పలికే అవకాశం ఉంది. అలాగే దూర ప్రాంతాలకు రవాణా చేసేందుకు పనికి రావు. గెలలకు ఎండిన ఆకులను చుట్టడం, గెలపై ఉన్న రెండు ఆకుల కాడలను మడచి ఆకులతో గెలతో ఆఛ్ఛాదనను ఏర్పాటు చేస్తే ఎండ నుంచి రక్షణ కల్పించవచ్చు. పాలిథిన్ సంచులు గెలలకు తొడిగి రక్షణ కల్పించవచ్చు. ఇలా చేయడం వల్ల కాయల కోత తరువాత అంత్రాక్నోస్ మచ్చ తెగులు తీవ్రత నుంచి కూడా కాపాడుకోవచ్చు. ఇలాంటి చర్యలు చేపడితే వేసవిలో ఎండ తాకిడికి పండ్ల తోటలను రక్షించుకునేందుకు అవకాశం ఉంది.

లారీ బోల్తాపడి డ్రైవర్ మృతి



రాకేశ్ (ఫైల్)

కాసిపేట: లారీ బోల్తా పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని మల్కేపల్లి గ్రామానికి చెందిన అడ్లూరి రాకేశ్ (27)లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి లారీలో సిమెంటు లోడ్ చేసుకుని వెళ్తుండగా సిద్దిపేట వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో లారీ బోల్తాపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి తండ్రి, సోదరుడు ఉన్నారు.

వడదెబ్బతో తునికాకు కూలీ..

చింతలమానెపల్లి: మండలంలోని అంబగట్టుకు చెందిన తునికాకు కూలీ బండి విమల (58) వడదెబ్బతో మృతి చెందినట్లు ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు. విమల ఈనెల 10న తునికాకు సేకరణకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. మంగళవారం అడవికి వెళ్లిన గ్రామస్తులకు మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి కుమారుడు కొండయ్య ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గుడుంబా పట్టివేత

దస్తురాబాద్: మండలంలోని గొడిసిర్యాలలో బుధవారం 25 లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన కొంపెల్లి నర్సయ్య వద్ద 8 లీటర్లు, జక్కుల సత్తవ్వ వద్ద 9 లీటర్లు, బత్తుల రాజన్న వద్ద 12 లీటర్ల గుడుంబాను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సురేందర్, రజిత, కళ్యాణి పాల్గొన్నారు.

పోడు సాగుదారుల గోస తీరుస్తా

- బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

తాండూర్: పోడు భూములు సాగు చేస్తున్న పేదల సమస్యలు తీరుస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బుధవారం మాదారం గ్రామపంచాయతీ పోచంపల్లి గ్రామంలో పోడుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఏళ్ల తరబడి నుంచి పోడు భూములు సాగు చేస్తుండగా అటవీ అధికారులు బెదిరింపులకు గురి చేస్తున్నారని, కేసులు పెడతామని హెచ్చరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అటవీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అంతలోనే అక్కడికి చేరుకున్న డెప్యూటీ రేంజ్ అధికారి జాడి తిరుపతితో ప్రత్యేకంగా మాట్లాడారు. పోడు భూములు సాగు చేస్తున్న పేదల జోలికి వెళ్లవద్దని సూచించారు. అటవీ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, డెప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్, డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, తాండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్.మహేందర్ రావు, మాజీ జడ్పీటీసీ బానయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, కొత్తపల్లి బీట్‌పరిధిలో పోడు పత్రాలు లేకుండా భూములు సాగు చేస్తున్న వ్యక్తులను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. హక్కు పత్రాలు లేకుండా భూమి సాగు చేస్తే ఊరుకునేది లేదని తాండూర్ సెక్షన్ అటవీ అధికారి సువర్ణ తెలిపారు.

భైంసా మున్సిపల్ కమిషనర్ పేరిట ఫేక్ కాల్స్..!

భైంసాటౌన్: 'హలో.. నేను భైంసా మున్సిపల్ కమిషనర్‌ను మాట్లాడుతున్నా.. మీరు ఈ ఏడాది ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోలేదు.. ఇలాంటివి కమిషనర్ దృష్టికి వచ్చేవరకు చూడొద్దు.. జరిమానా వేస్తున్నా..' 'ఇంకోసారి రిపీట్ కాకుండా చూసుకోండి.. నా వాట్సాప్ నంబర్‌కు హాయ్ అని పెట్టు.. దానికి స్కానర్ పంపుతాను.. సరేనా' ఇలా.. సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు.. ఏకంగా ప్రభుత్వ అధికారుల పేర్లతో ఫోన్ చేస్తూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. భైంసా మున్సిపల్ కమిషనర్ బి.రాజేశ్‌కుమార్ పేరిట పలువురు దుకాణదారులకు ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోలేదా.. జరిమానా వేస్తానంటూ బెదిరిస్తూ ఫేక్ కాల్స్ వస్తున్నాయి. అలా కాకుండా ఉండాలంటే తన వాట్సాప్ నంబర్‌కు హాయ్ అని పెడితే స్కానర్ పంపుతానని, ఆ నంబర్‌కు డబ్బులు పంపితే అంతా చూసుకుంటానని నమ్మిస్తున్నాడు. దీంతో పలువురు బాధితులు డబ్బులు కూడా పంపినట్లు తెలిసింది. ఫేక్ కాల్స్‌కి సంబంధించి ఆడియో రికార్డులు సోషల్ మీడియా ద్వారా మున్సిపల్ కమిషనర్ దృష్టికి రావడంతో ఆయన బుధవారం స్పందించారు. ఇలాంటి ఫేక్‌కాల్స్ నమ్మవద్దని సూచించారు. ట్రేడ్ లైసెన్స్, ఇతర ఫీజులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఫోన్ చేయరని, ఎవరికైనా ఇలాంటి ఫేక్ కాల్స్ వస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. పట్టణంలోని ఓ పెట్రోల్ బంక్ మేనేజర్‌కు సైతం మున్సిపల్ కమిషనర్ పేరిట ఫోన్ చేసి బెదిరించడంతో అతను రూ.4వేలు పంపినట్లు తెలిసింది.

రుణం ఇప్పిస్తానని చైన్ అపహరణ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని దస్నాపూర్ కాలనీకి చెందిన ఓ వృద్ధురాలికి రుణం ఇప్పిస్తానని గుర్తు తెలియని వ్యక్తి మాయమాటలు చెప్పి బంగారు చైన్ అపహరించిన ఘటన చోటు చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. బుధవారం కాలనీకి చెందిన సరస్వతీకి రుణం ఇప్పిస్తానని చెప్పి ఓ గుర్తు తెలియని వ్యక్తి నమ్మించాడు. దీంతో ఆమె అల్లుడైన భూమన్నకు బంగారు గొలుసు ఇచ్చి అతనివెంట పంపిస్తుంది. గుర్తు తెలియని వ్యక్తి భూమన్నను తీసుకుని రాంనగర్ కాలనీలో గల యాక్సిస్ బ్యాంక్‌కు వెళ్లాడు. బంగారం తూకం వేయించుకుని వస్తానని చెప్పి భూమన్నను కిందనే ఉంచి పైకి వెళ్లాడు. మళ్లీ కిందకు వచ్చి ఆధార్ కార్డు కావాలని చెప్పడంతో భూమన్న ఇంటికి వెళ్తుండగా అంతలోనే సదరు వ్యక్తి చైన్‌తో పరారయ్యాడు. సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.